కథా నిలయం
4824
శ్రీకాకుళం

# పుత్రకామేష్టి

నీరసంగా మేడ మెట్లెక్కి అంతకన్నా నీరసంగా తలుపులు తీసి, అలానే మంచంమీద కూలబడ్డాడు సారథి. ఎప్పుడో ముంచుకొస్తుందనుకొన్న సుస్తీ ఈ పూటనే ప్రారంభమయినట్లుగా ఉంది. ఇంతా చేసి సుబ్బుల్ని విడిచిపెట్టి అరగంట కాలేదు. మహాఅయితే రైలు కొలకలూరు చేరుతుందేమో? ఇప్పటికే, బోలెడంతకాలం గడిచి పోయినట్టూ, తనకూ సుబ్బులుకూ మధ్య, ఏవో అగడ్తలు ఏర్పడినట్టూ, ఆ అగడ్తలనిండా రక్కిస పొదలు ఇంతెత్తున మొలిచి మానవమాత్రునికి దాటశక్యం కానట్టూ అనిపించింది,

అప్పటికీ ఆవిడ ప్రయాణాన్ని చెడగొట్టాలని సారథి చేయవలసిన ప్రయత్నాలన్నీ చేశాడు. తనకు హోటలు తిండి సరిపడదన్నాడు. మతిమరుపు జాస్తి గనక పనిమనిషి, ఈ అవకాశాన చేవాటు వేయొచ్చునన్నాడు. ఆఫీసుపని మహావత్తిడిగా ఉంటుందన్నాడు. చచ్చీచెడి చాకిరీ చేసుకొస్తే, ఇంటిదగ్గర 'నా' అన్నదిక్కు లేకపోతే ఎలాగన్నాడు. సుబ్బులు అన్నిటికీ అన్ని సమాధానాలూ చెప్పింది. గమ్మత్తేమిటంటే ఆవిడ చెప్పిన జవాబులన్నీ, తనను మళ్ళా ప్రశ్నించడానికి అవకాశం లేకుండా ఉన్నాయి. ఇక తప్పనిసరైంది, సుబ్బుల్ని పుట్టింటికి పంపించేశాడు.

తీరా ఆలోచిస్తుంటే — తన కృషిమీద తనకే అనేక అపనమ్మకాలు కలిగాయి సారథికి. తను నిజంగా గట్టి పట్టు

పట్టినట్లయితే, సుబ్బులు ప్రయాణాన్ని మానుకొని ఉండేదనిపిస్తోంది. ఆవిడతో తను సరిగ్గా ఆర్గ్యూ చేసి ఉన్నట్లయితే, అసలీ గొడవలే ఉండేవి కావనీ అనిపిస్తోంది. తన వాదనలో — తనలో — ఎక్కడో, ఏదో, బలహీనత ఉండి ఉండాలి. అదెక్కడో సుబ్బులుకు బాగా తెలుసు. అవసర మయినప్పుడు వినియోగ పెట్టుకొని, కార్యం సానుకూల పరుచుకొంటూ ఉంటుంది.

సారథి మనస్సునంతా మబ్బు కమ్మినట్లయింది. ఆ మబ్బుమీద, సుబ్బులు, ముగ్గురు పిల్లలు స్పష్టంగా కనిపిస్తున్నారు. మరేదీ కనుపించడం లేదు.

సారథికి ఉక్కపోస్తున్నట్టుగా ఉంది. చొక్కా విప్పి వంకెకు తగిలించాడు. లుంగీ కట్టుకున్నాడు. పడక కుర్చీ వరండాలోకి లాక్కొని, పిట్టగోడకు కాళ్ళు తన్నాయించి, చేరగిలబడి కూచున్నాడు. పొన్నాగచెట్టు మీదించి పలచని గాలి వచ్చి, అతన్ని తాకుతో వెళ్ళిపోయింది. ఎవరో పిలిచినట్లయి వెనక్కు చూశాడు. బోసిగా ఉన్న ఇల్లు ఓసారి బావురుమన్నట్లయింది. రెండుచూపుడు వేళ్ళతోనూ కళ్ళు నులుముకొని, సిగరెట్ అంటించాడు సారథి —

"ఇప్పటికే దుగ్గిరాల చేరుకుంటారు" అనుకున్నాడు సారథి. మరోగంటకల్లా — ఎంత హీనంగా చూసుకున్నా బెజవాడ చేరతారు. ఆఖరి బస్సయినా అందుతుంది. అధమం ఎనిమిది గంటలకు కీసర దగ్గర దిగితే, నడవటానికి గంటసేపయినప్పటికీ తొమ్మిదింటికల్లా 'అడంగు' చేరుకుంటారు. అప్పటికే చిన్న పిల్లలిద్దరూ నిద్రకొచ్చి ఉంటారు; బహుశా దోవలో వారు నిద్రపోయినా పోవచ్చు —

ఈ ఊహ సారథిని కలచివేసింది. చివాలున కుర్చీ లోంచి లేచి, తన మంచం కేసి చూసుకున్నాడు. దాన్నిండా చిందరవందరగా గుడ్డలు పడి ఉన్నాయి. 'పద్దు ముండ' ఈ పక్కన పడుకొంటుంది. కాళ్ళు మీదేస్తుంది, గువ్వలాగా డొక్కలో ముడుచుకొని పడుకొంటుంది. ఏ అర్ధరాత్రో, అపరాత్రో హఠాత్తుగా లేచి, అకారణంగా ఏడుపు సాగిస్తుంది. తనూ ఉలిక్కిపడి లేస్తాడు. పగలల్లా ఆఫీసు పనిలో అలసి ఉంటాడేమో కమ్మని నిద్రకు ఆటంకం కలిగే సరికి ఎక్కడ లేని చిరాకు పుట్టుకొస్తుంది. 'పద్దు ముండ'ను కసిగా కూలేసి, అంతకన్నా కసిగా చిచ్చి కొడతాడు. ఒక్కోసారి కాస్సేపు గునిసి 'పద్దు' నిద్రపోతుంది. ఒక్కోసారి మెలికలు తిరుగుతూ మారాం చేస్తుంది. 'పద్దు ముండ'ది కొట్టడానికి, వోదార్చడానికీ కూడా అనువైన వయస్సుకాదు. చెపితే తెలీదు. తెలుసుకోదేమని తనకు కోపం! తన కోపానికి అర్థంలేదని, అనేక సార్లు తను అనుకున్నాడు కానీ కోపం రాకా మానదు. తను దాన్ని వెళ్ళగక్కకా మానడు. తన దంతా చేతులు కాలాక ఆకులు పట్టుకునే ధోరణి! అప్పటికి ప్రయోజనం కాస్తా చేజారిపోనే పోతుంది.

— పోనీ ఇంత చిరాకుపడ్డా 'పద్దు' తన దగ్గరకు రావడం మానేస్తుందా అంటే — అదీ లేదు. ఓ చెంప కసురుకొంటుంటే మరో చెంప కాళ్ళకు చుట్టుకొంటుంది. లగ్గలకెత్తి ఏడుస్తూనే, ఎత్తుకోమని చేతులు చాపుతుంది. విదిలించి కొట్టిన పావుగంట కల్లా 'నాన్నా! మలేమో, లవిగాడేమో,' అంటూ అన్నమీద ఏదో చాడీలు చెపుతుంది. అప్పటికింకా కన్నీటి చారలు బుగ్గలమీద ఉండనే ఉంటాయి. కనురెప్పలు

నీటితో తడిసే ఉంటాయి. వెక్కెక్కి ఏడుస్తూనే ఉంటుంది పెదవులు మాత్రం నిర్మలంగా నవ్వుతుంటాయి, అలాంటప్పుడు తనను తాను చాలాసార్లు కఠినంగా తిట్టుకున్నాడు. 'మరెప్పుడూ పిల్లల్ని కొట్టకూడదు' అనుకుంటాడు. కానీ ఆ కాస్సేపే! అంతా దాలిగుంటలో కుక్క తంతు.

ఓసారి 'పద్దు ముండ' ను వేరే మంచంమీద పడుకోబెట్టడం జరిగింది. ఆ పూట పెద్దవాడు తన దగ్గర పడుకోవాలని మారాం చేశాడు. ఓ రాత్రివేళ ఏదో చప్పుడైతే తను కళ్ళు తెరిచాడు. 'పద్దు' తనకోసం అన్ని మంచాలు వెదుకుతోంది. తన్ను చూసి ఒక్క ఉదుటున మెడ కావలించుకొని పొట్టమీదపడి నిద్రపోయింది. తనకు చిరాకు, సంతోషమూ కూడా కలిగాయి.

—ఒకోసారి ఈ పాడు సంసారప్పీడ వదిలి ఎటన్నా పారిపోదా మనిపిస్తుంది. కొంతకాలం పాటైనా ఈ రొటీన్ నుండి విముక్తి లేకపోతే బ్రతకడం దుర్భరమనిపిస్తుంది. ఏదన్నా మార్పు — గొప్ప మార్పు — వస్తే బావుండు ననిపిస్తుంది. కాని నిజంగా మార్పొంటూ వచ్చేసరికి తను దాన్ని భరించలేకపోతున్నాడు. రవంత ప్రశాంతి కావాలని ఎన్నోసార్లు అనుకున్నాడు. ఈ గోల, రద్ది, భార్య, పిల్లలు, అల్లరి, బాకీలు, వంట మాయమయి — నిశ్శబ్దం, గాఢమైన నిశ్శబ్దం — కావాలని మనస్సు ఎన్నోసార్లు కలవరించింది. కాని, ఆ నిశ్శబ్దాన్ని భరించడం తనకు సాధ్యం కాదు; అందని వస్తువు అందకుండా ఉండడంలో ఉన్న ఆనందం — అందడంలో లేదు. లేదు సరికదా, ఏ మాత్రమో విషాదాన్ని కూడా అది ధ్వనిస్తుంది.

ఇప్పుడు తను కావాలనుకున్న ప్రశాంతత ఉంది. శ్శబ్దం ఉంది. మరో నెల రోజులపాటు తను వేసిన వస్తువులు సినచోట ఉంటాయి. వాటికోసం వెదుకులాట ఉండదు. రాత్రిళ్ళు హాయిగా నిద్రపోవచ్చు. ఏనాడో కొన్న పుస్తకాలు చదువుకోవొచ్చు. చూడాలనుకొంటున్న స్నేహితుల్ని చూడవచ్చు. ఖర్చు చెయ్యటానికి కావలసినంత కాలం తనకుంటుంది. కానీ ఈ విలువలన్నీ మురిగిపోతా యనిపిస్తుంది. ఏమీ తోచక పిచ్చెక్కుతుందేమో అనిపిస్తుంది. పోనీ అదైనా బావుణ్ణు — సుబ్బులు, పిల్లలు చప్పున తిరిగన్నా వస్తారు——

“భోజనం అయిందా?” అంటూ ఉమాపతిగారు మేడ మెట్లెక్కి వచ్చారు.

సారథి కాళ్ళుదించి స్థిమితంగా కూచున్నాడు. మరో ర్చీ తెచ్చి ఉమాపతిగారిని కూర్చోమన్నాడు. వరండా లోని లైటు వేశాడు.

“లైటు లేకపోతే — మీ రప్పుడే పడుకొన్నా రేమో ననుకొన్నాను” అన్నాడు ఉమాపతి.

అలా అనుకొన్న మనిషి ‘భోజనం అయిందా?’ అని ఎలా అడిగాడో సారథికి అంతు బట్టలేదు.

“ఇంకా లేదండీ!” అన్నాడు సారథి.

ఉమాపతిగారు ఓ క్షణం ఊరుకొని “రైల్లో జాగా దొరికిందిగదా! కిందటిసారి ఏం జరిగిందనుకున్నారు?” అంటూ ప్రారంభించాడు.

సారథి అంత ఉత్సాహం చూపెట్టలేదు. అయినా ఉమాపతి ప్రారంభించాడు.

"మా వరూధినిని ఊరికి పంపుదామని స్టేషను కెళ్ళాను. రైల్లో అరంగుళం జాగాలేదు. కడ్డీలమీద వేళ్ళాడు తున్నారు జనం. అలాంటప్పుడు దాన్నొక్క-దాన్నీ ఎలా పంపను చెప్పండి! ఏమయితే అదే అవుతుందని, దాంతోపాటు నేనూ రైల్లో పడ్డాను" అన్నాడు ఉమాపతి నోరారా నవ్వుతూ.

ఇందులో అంతగా నవ్వవలసిం దేమున్నదో సారథికి తెలియలేదు. కానీ ఓ విషయం మాత్రం తేలిపోయింది. ఉమాపతిగూడా తన బాపతు మనిషే! భార్యను విడిచి గడియసేపు ఉండలేడు. ఒక్క- మనిషికి చోటులేదన్నవాడు కాస్తా, ఇద్దరం బండెక్కా- మంటున్నాడంటే, చోటు లేక పోవడమన్నా అబద్ధం కావాలి, లేదా తను ప్రయాణం చేసిన సంగతన్నా అబద్ధం కావాలి.

"మళ్ళా వారం పది రోజుల్లో వస్తారనుకుంటాను. అంతే గదండీ?" అన్నాడు ఉమాపతి.

'కాదు' అని చెప్పడానికి బాధపడ్డాడు సారథి. నెల దాకా రారని చెప్పడానికే దిగులు వేసింది. అందుకనే, 'ఔ' ననీ 'కా'దనీ తేల్చకుండా తల పంకించాడు.

"మన మేదో అనుకోంటాం గానీ — పిల్లా జెల్లా లేక పోతే యిల్లు పాడు పడ్డట్లుంటుందండీ! అలాంటి కొంపలు చూస్తుంటే నాకు దయ్యాల కొంపలు జ్ఞాపకం వస్తాయి. లింగు లింగు మంటూ ఎంత మంది పెద్దవారున్నా, ఆ ఇంట్లో ఏదో లోపించిందనిపిస్తుంది. సగం అందుకే మీకు ఇల్లద్దె కివ్వటానికి వొప్పుకున్నాను" అన్నాడు ఉమాపతి.

సారథి అదోలా నవ్వాడు.

"నేను పెద్ద లక్షాధికారిని కాననుకోండి. కానీ ఇళ్ళద్దె మీద బతకాల్సిన అవసరం కూడా లేదు. మరెందు కిచ్చా నంటారు? ముఖ్యంగా మీ పిల్లల కోసమనే!" అన్నాడు ఉమాపతి ఒక్కసారి గట్టిగా నిట్టూర్చి. "భగవంతుడు ప్రతి వాడికీ అంతో ఇంతో విచారమంటూ కలగజేస్తుంటాడు. మా జగన్నాథాన్ని ఎరుగుదురుగా — డిస్పాచి క్లర్కు — పాపం తొమ్మిది మంది సంతానం. మళ్ళా వాడి పెళ్ళాం లేవ లేకుండా ఉన్నదిట. ఓ పాతికుంటే చేబదు లివ్వమంటూ అడిగాడు. ఆ జంజాఖానాలో జగ్గుగాడు ఉడ్డుగుడిచి ఛస్తున్నాడు. 'కావాలోయ్ దేవుడా!' అనే మాబోటి రకానికి ఒక్క పిల్లవాడు కలగడు. దీనిక్కారణం ఏమిటంటారు? పిల్లలు ఎక్కువై జగ్గుగాడు, లేక మేమూ ఏడవాలని దేవుడి సంకల్పం. ఇంతకన్నా నాకేమీ తట్టడం లేదు." ఉమాపతి కాస్సేపు ఆగాడు.

అప్పుడే దొడ్లో లైటు వెలిగింది. పనిమనిషి అంట్లన్నీ బావి దగ్గర వేసి తోముతూ ఉంది.

"అంతదాకా దేనికి?" అంటూ ప్రారంభించాడు ఉమాపతి. ఈ సత్తెమ్మకి నలుగురు బిడ్డలు. ఇప్పుడు ఆరో నెలట. ఇందాక పరూధిని అంటుంటే విన్నా. దీని మొగుడు రిక్షా తోలుతాట్ట. వచ్చిన బాడిగంతా పెట్టి తెగతాగు తాట్ట. వారానికో పది రోజులకో కొంప కొస్తాట్ట. వచ్చి నప్పుడు మాత్రం ఓ రూపాయి డబ్బులు దీని మొఖాన కొట్టి ఆ రాత్రి ఉండి, ఉదయమే చెప్పకుండా ఉడాయిస్తాట్ట. మే మిచ్చే పది రూపాయలే దాని కాధారమట. ఈ సంగతి తెలి

సాక, ఇంత అన్నం గూడా పెట్టమన్నాను. దాని పిల్లల్ని మీరు చూశారో లేదో గానీ, పళ్ళల్లే ఎంత ముద్దొస్తారనీ!”

“చూడకేం. చూశానులెండి!” అన్నాడు సారథి.

“మొన్న పోయిన సంక్రాంతికి ఆ పిల్లలందరికీ గుడ్డలు కట్టించాను, అది ‘వద్దు బాబో’ అంటున్నా.

“పిచ్చిముండ, జీతంలో బిగబట్టుకొంటా ననుకుంది గావును. ఊరికే యిచ్చానని తెలిశాక ఎంత సంబరపడ్డ దనుకొన్నారు!” అన్నాడు ఉమాపతి. “మీకు తెలుసునో లేదోగానీ!” అంటూ మళ్ళా ప్రారంభించాడు. “మీపద్దుకూ మా వరూకు మాలావు దోస్తీ లెండి. చక్కగా దాని పొట్ట మీద కూచుని కబుర్లు చెబుతుంది. పాడుతుంది, గెంతుతుంది. మీ గొంతుగానీ, అమ్మాయి గొంతుగానీ వినిపించిందో, హరిబ్రహ్మాదులు పట్టుకొన్నా ఆగదు. ఈపూట అదిగూడా అదోలా ఉంది!”

సారథికి ఏకాంతంగా ఉండాలనిపించింది. కాని ఉమాపతి వదిలేలా లేడు. అందుకనే, రాని ఆవలింత ఆవలించాడు.

“నిద్రొస్తున్నట్టుందే?” అన్నాడు ఉమాపతి.

“మరే!” అన్నాడు సారథి.

ఉమాపతి వెళ్లిపోయాడు. సరిగ్గా అదే సమయానికి వరూధిని దొడ్లో బావి దగ్గరకొచ్చింది. లైటుకాంతి ఆవిడచీర అంచులమీద పడి, జరీ ఉన్నంత మేరా జ్వాలలా మెరిసింది. సారథి రెండు చేతులూ పైకిచాపి మెటికలు విరుచుకొన్నాడు.

* * * *

ఎవరో నలుగురు ఆడవాళ్ళు – అందులోనూ చాలా అందంగా ఉన్న ఆడవాళ్ళు – ఒక యువకుణ్ణి చుట్టుముట్టారు.

ఆ యువకుడు వాళ్ళను పట్టుకోబోయాడు. చిత్రంగా వారందరూ కలిసి ఒక్క మనిషిగా అయిపోయారు. ఆ మనిషి వెంట పడ్డాడు ఆ యువకుడు. అతనికి చిక్కినట్టేచిక్కి అంతలోనే ఆవిడకాస్తా మాయమయిపోయింది. ఆవిణ్ని వెదుకుతూ అతను చప్పున గాలిలోకి ఎగిరాడు. రంగు రంగుల మబ్బులు అతన్ని చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరి చేశాయి. వాటి నన్నింటినీ భేదించుకొని, అతను ప్రచండ శక్తితో ఇంకా పైకి వెళ్ళాడు. అక్కడొక అందమైన తోట ఉంది. ఆ తోట నిండా రక రకాల పూలు విరియబూసి ఉన్నాయి. ఆ పూలన్నీ విద్యుద్దీపాలు మెరిసినట్టు తళతళ లీనుతున్నాయి. సన్నగా గొంతెత్తి పాట పాడుతున్నాయి. కమ్మని వాసనలు సుడులు తిరిగి దూరంలోకి వెళ్ళిపోతున్నాయి. దోవనిండా పచ్చని పీతాంబరం పరచినట్లుంది. ఆ దోవమీదుగా అతను ముందుకెళ్ళాడు. ఎదురుగా ఒక మేడ కనుపించింది. ఆ మేడలోని వారు గోడల గుండా బయటికి కన్పిస్తున్నారు. అతని సుందరి ఆ లోపల ఉన్నది. వెంట ఎవ్వరూ లేరు. అతను గోడల్లో నుంచే ఆమె దగ్గర కెళ్ళాడు. ఆమె రెండు చేతులూ చాపి, అతన్ని దగ్గరకు తీసుకొన్నది. పెదవుల మీద ముద్దు పెట్టుకొన్నది. ఆమెనోరు కస్తూరి వాసన వేసింది. ఆశ్చర్యంగా ఆమె కళ్ళల్లోకి చూస్తున్నాడు. చూస్తుండగనే, ఆమె అతని కౌగిలిలోనే మాయ మయింది. అతను ఆమెకోసం బిగ్గరగా పిలిచాడు...

మేడ మెట్లమీద నుండి ఎవరోవస్తున్న మెత్తని చప్పుడు సారథి గదిదాకా వచ్చి ఆగిపోయింది. ఆ తరువాత తలుపు మీద 'టక టక' మని ధ్వని అయింది. మరోనిముషానికి రెండు

రెక్కలూ విడివచ్చాయి. వాకిట్లో వరూధిని నిలబడి ఉంది. సారథి మెడదాకా శాలువా కప్పుకొని నిద్రపోతున్నాడు.

'ఇది దొంగ నిద్ర కాదుగదా!' అనుకొన్నది వరూధిని. ఇట్లా ఎందు కనుకున్నదో ఆమెకే తెలియదు. 'తిరిగి పోదామా ?' అనుకొన్నది. పనిమాలా పిలిచిన మనిషి ఇంతలోకే ముసుగెట్టుకోవడ మేమిటనుకొన్నది. తనతో హాస్యమాడుతున్నాడా ఏమిటనుకొన్నది. ఓ నిముషంపాటు ఏమి చెయ్యటానికి పాలుపోక అలానే నిలబడి పోయింది. సారథి మాత్రం యథాప్రకారం, మెడదాకా కప్పుకొని నిద్ర పోతూనే ఉన్నాడు.

—అతను కళ్ళు తెరచి చూసేసరికి టేబిలుమీాద వెండి పళ్ళెమూ, దాన్నిండా పకోడీలూ కనిపించాయి. ఆ ప్రక్కనే వెండి మరచెంబు నిండా మంచినీళ్ళున్నాయి. సారథి ఓ క్షణ కాలంపాటు కలవరపడ్డాడు. ఛటుక్కున సుబ్బులు జ్ఞాపకం వచ్చింది. ఆవిడా అంతే! తను నిద్రలేచే సరికి అలానే ఫల హారం బల్లమీాదపెట్టి ఉంచుతుంది. 'కొంపదీసి ఇది కల కాదుగదా ?' అనుకొన్నాడు సారథి. ఇలా తను చూస్తున్న దన్నా కలకావాలి. లేదా సుబ్బులు ఊరికెళ్ళడమన్నా కల కావాలి. 'ఈ చివరిదే కలయితే బావుణ్ణు' అనుకొన్నాడు సారథి.

లేచి ముఖం కడుక్కున్నాడు. కొంత మైకం వదలి నట్లనిపించింది. కుర్చీ దగ్గరగా లాక్కుని టేబిలుమీాదికి వంగాడు. అద్దంలో తన ముఖం ఇంకెవరి దానిలాగానో కనిపించింది. జుట్టంతా రేగి ఉంది.

'సుబ్బులుంటే ఇలా జుట్టు రేగనివ్వదు' అనుకొన్నాడు సారథి.

అనేకసార్లు బద్ధకంవల్లా, అశ్రద్ధవల్లా, విసుగువల్లా, తల దువ్వుకోకుండా తను ఆఫీసు కెళ్ళబోతుంటే— సుబ్బులు పనిమాలా పిలిచి తలదువ్వి పంపేది.

'ముగ్గురు బిడ్డల తండ్రులయ్యారు. ఇంకా మీకు చిన్నతనం పోకపోతే ఎట్లా ?' అనేది సుబ్బులు తలకు నూనె రాస్తూ.

'నీలాంటి భార్య దొరికిన వాళ్ళందరకూ, వయస్సు పెరగడానికి బదులు తరుగుతూ ఉంటుంది. ఇందులో నా ప్రయోజకత్వ మేమీ లేదే!' అనేవాడతను.

'చాల్లెండి నేర్చుకుపోయారు. ఎవరన్నా వింటే నవ్వుతారుగానీ —' అనేది సుబ్బులు, ఎవ్వరూ వినరని తెలిసినా.

అటువంటి సమయాలల్లో సారథికి తన పూర్వ జీవితం జ్ఞాపకం వొచ్చేది. ఇప్పటి జీవితంతో దాన్ని పోల్చుకొని వణికిపోయేవాడు. ఆ రోజుల్లో తను తాడు తెగిన గాలిపటం లాగున ఉండేవాడు. ఎవరినీ లక్ష్యపెట్టేవాడు కాదు. దేనికీ తలొగ్గేవాడు కాదు. కుండబద్దలు కొట్టినట్టు మాట్లాడేవాడు. ఉన్ననాడు తినేవాడు లేనప్పుడు కడుపులో కాళ్ళు పొదుపుకొని పడుకొనేవాడు. పొట్టచేతబట్టుకొని, ఊరూరూ తిరిగాడు. చెప్పరాని బాధలు పడ్డాడు. మైళ్ళకు మైళ్ళు, విసుగు విరామమూ లేకుండా తిరిగాడు. తన జీవితానికో గమ్యం లేదు. ఎటు పోవాలో తెలీదు. అందుకనే దోవ వెదుక్కుంటూ తిరిగాడు. అంతా అయోమయంగా ఉండేది. చిక్కు చిక్కుగా ఉండేది. తను తప్ప లోకమంతా సుఖంగా ఉన్నదనిపించేది,

తన మీాద పగపట్టి, తనను తరిమి తరిమి కొడుతున్న దనిపించేది. అసూయ పడుతున్నదనిపించేది. అయితే — ఏ తుణానా, తననుచూసి అసూయపడవలసిన అవసరం లోకానికి లేదని అతనికి అనిపించ లేదు. తరిమి తరిమి కొట్టవలసిన అగత్యం లోకానికి ఏమీా లేదనికూడా అతని కనిపించ లేదు. పగ! అదొక్కటే అనునిత్యం తన కళ్ళ ముందు కదులుతూ ఉండేది. మనిషికీ మనిషికీ మధ్య పగ తప్ప ఇంకేమీా ఉండటానికి వీలే లేదని తను ఆరోజుల్లో గట్టిగా నమ్మాడు. ఆ నమ్మకాలన్నీ భ్రమా జనితాలని ఇప్పుడనుకొంటున్నాడు గానీ ఆ రోజుల్లో అవి సత్యాలనే తను అనుకొన్నాడు. ఒక్క మాటలో చెప్పాలంటే, ఆనాటి తన జీవితం అరాచకత్వానికి నిలయం.

అటువంటి జీవితాన్ని — సుబ్బులు దోవలోకి తెచ్చింది. తన జీవితాన్ని మార్చడంలో ఆవిడ ఏనాడూ తన మనసును నొప్పించ లేదు. తన వాదనలన్నీ వింటూనే, వాటిని అంగీకరిస్తూనే అవి తప్పని ఆచరణలో నిరూపించింది. అనేకసార్లు అనుకొన్నాడు తను — 'సుబ్బులు లేకపోతే తను ఏమయి ఉందునా?' — అని. ఏమయి ఉంటాడో అతను ఊహించ లేకపోయాడు. అసలు సుబ్బులు లేకపోవడమన్న దాన్ని ఆలోచించటానికే అతను భయపడేవాడు. అందుకే అతను, భార్యను విడిచి ఉండటానికి గిలగిల లాడిపోయేవాడు.

భార్యకు ఉత్తరం రాదామని ఉదయమే కవరుపట్టుకొచ్చాడు. తీరా రాయబోయేసరికి చెయ్యి వెనుకాడింది. సుబ్బులు ఊరికెళ్ళి ఇంకా ఇరవై నాలుగ్గంటలన్నా కాలేదు. ఇప్పటి కప్పుడే తను ఉత్తరం రాయడం మాత్రం ఏమి

భావ్యంగా ఉంటుంది? అథవా రాసినా, దాన్ని చూసి నలుగురూ ఏమనుకుంటారు? పోనీ సుబ్బులు కయినా తన మీద గౌరవం తగ్గిపోదా? తనింతగా ఆవిడకు లోకు వయ్యానని తెలిస్తే — ఇంతవరకూ తెలీడం కాదు — తెలిసిందన్న ఆ విషయం, తనను మరింత బాధ పెడుతుంది. అది భరించటం కన్నా, సుబ్బులు లేని బాధను భరించడమే మంచిదనుకొని ఉత్తరం రాసే ప్రయత్నాన్ని మరోసారికి వాయిదా వేసుకున్నాడు.

ఆ కవరు బల్లమీద అలానే పడి ఉంది. దాన్ని చూసి గాఢంగా నిట్టూర్పు విడిచాడు సారథి. ఆ వెంటనే ఉలిక్కిపడి వాకిలికేసి చూశాడు. వరూథిని సన్నగా నవ్వుతూ వాకిట్లో నిలబడి ఉంది. రెండు చేతులతోనూ, ద్వారబంధపు రెండు నిలువు కమ్ములూ పట్టుకొంది. వక్షస్థలం వికసించి నట్లనిపించింది సారథికి.

'ఏమి టాలోచిస్తున్నారు?' అన్నది వరూథిని. తను ఆలోచిస్తున్నదంతా చెప్పడం సారథికి ఇష్టం లేకపోయింది.

'ఇవి మీరు తెచ్చారా ఏమిటి?' అన్నాడు సారథి పలహారప్పళ్ళాలకేసి చూస్తూ.

'మరే!' అన్నది వరూథిని.

'ఎందుకండీ అంత శ్రమ?' అన్నాడు సారథి.

'మీకా? నాకా?' అన్నది వరూథిని.

సారథికి ఏం చెప్పాలో తోచలేదు.

'నాకయితే — దాన్ని గురించి మీరు పట్టించుకోకండి. మీ కయితే — అయినా పలహారం తినడం శ్రమని నేననుకోను' అన్నది వరూథిని.

సారథి తినడం ప్రారంభించాడు.

'ఇందాక మీరుగాని పిలిచారా?' అన్నది.

'ఎప్పుడు?'

'అదే – అరగంట క్రిందట?'

'లేదే!' అన్నాడు సారథి ఆశ్చర్యంగా ఆమె కేసి చూస్తూ.

'ఈ అబద్ధా లెప్పట్నించి?'

'నేను పిలవందే?' అన్నాడు సారథి ఆమె కేసే చూస్తూ.

వరూధిని ఫకాలున నవ్వింది. ఆ తరువాత కళ్లు మూసుకొని గాఢంగా విశ్వసించింది. ఓసారి మెట్ల కేసి పరిశీలనగా చూసి గదిలో కొచ్చింది. సారథి పడుకొన్న మంచంమీద కూచుంది. చేతులు రెండూ వెనక్కు చాచింది. కాళ్ళు సుతారంగా, కదిలీ కదలనట్టు ఊపసాగింది.

'అంత భయపడతా రెందుకూ?' అన్నది వరూధిని. 'ఇందులో తప్పేముందిగనక? మీరు పిలవనూవచ్చు, నేను రానూవచ్చు. అయితే అత్తయ్య వింటే ఏమన్నా అనుకొని పోతుందని నాగోలగాని మరేం లేదు.'

సారథి బుర్రలో కందిరీగ రొద ప్రారంభమయింది. చేతిలో ఉన్న మంచినీళ్ళ గ్లాసు అలానే ఉండిపోయింది.

'ముందాగ్లాసు బల్లమీద పెట్టి, ఆ తరవాత ఆశ్చర్య పోరాదూ. అది ఇద్దరికీ క్షేమంగదా?' అన్నది వరూధిని.

సారథి మౌనంగా నవ్వాడు.

'పిలవదలుచుకొంటే, అంతగా పొలికేకలు వేయనక్కర్లేదు. ఉంటే గింటే అత్తయ్యకు రవంత చెముడు గానీ

నాకు కాదాయె! అలా గావుకేక లెందుకండీ!' అన్నది వరూధిని.

ఆవిడ తనను మెత్తగా చీవాట్లు పెడుతున్నదో నచ్చ చెప్తుతున్నదో సారథికి అర్థం కాలేదు. ఇవేవి భరించడాని కయినా, తను ఆవిణ్ని పలకరించి నప్పటిమాట గదా! అటు వంటిదేమీ జరగందే!

'మిమ్మల్ని పిలిచినట్లు జ్ఞాపకం లేదండీ!' అన్నాడు సారథి.

'అన్నట్లు మరో విషయం మీకు చెప్పదలచాను. మీ కంటే చిన్నవాళ్ళను మీరు అతిగా గౌరవించకండి. ఆయు క్షీణం అంటారు.' అన్నది వరూధిని.

'ఏమనిపిలవమంటారు!' అన్నాడు సారథి గత్యంతరంలేక

'అది మీ ఇష్టం!' అన్నది వరూధిని. 'కబుర్లలోపడి తినడమే మానేశారు. చప్పున ఆ నాలుగూ నోట వేసుకోండి. ఈలోగా నేను కాఫీ పట్టుకొస్తాను.' అంటూనే కిందికి వెళ్ళి పోయింది.

సారథికి ఇదంతా చాల కొత్తగా ఉంది. ఇదివర కెపుడూ వరూధిని తనతో ఇంత చనువుగా మాట్లాడలేదు. అటువంటి అవకాశం కూడా కలగని మాట నిజం. తనతో మాట్లాడాలన్న వాంఛ వరూధినిలో ఉన్నదని తనకు లీలగా అనుమానం. సుబ్బులు ఒకటి రెండుసార్లు — ఇంకా ఎక్కువే కావచ్చు — వరూధినిని గురించి తనతో హాస్యమాడింది.

''ఆవిడ అలా మీకేసి చూస్తుంటే ఒక్కసారైనా మీరు చూడరేమండీ!'' అన్నదోసారి.

"ఇవ్వాళ చూశారా! అచ్చు నే కట్టుకున్న చిలకపట్టు చీర కట్టుకుంది" అన్న దింకోసారి.

"ఏమండోయ్. ఆవిడే గనుక మీ భార్యయితే, మిమ్మల్ని నెత్తికెక్కించు కొంటుందట. ఒప్పుకొంటారా?" అన్నది మరోసారి.

ఇప్పుడయితే ఇవన్నీ తనకు జ్ఞాపక మొస్తున్నాయి గాని, అప్పట్లో వీటిని గురించి తనసలు పట్టించుకోనే లేదు దీన్ని పట్టి చూస్తే.

వరూధిని ఫ్లాస్కు తీసుకుని పైకి వచ్చింది. ఈసారి ఆమెను చూసి దిమ్మెర పోయాడు సారథి. సుబ్బులు కట్టుకునే చీరె కట్టుకొంది. అలానే కుచ్చెళ్ళు పోసుకొంది. అటువంటి జాకెట్టే వేసుకుంది. సుబ్బులులాగే కాసిన్ని చామంతిపూలు ముచ్చిలి గుంటలో తురుముకొని ఓ గన్నేరు మొగ్గను పైగా అమర్చుకొంది.

తనను ఎగాదిగా చూస్తున్న సారథి కేసి చూసి, కింది పెదవి కొరుక్కుంది వరూధిని. గ్లాసులో కాఫీ పోస్తూ, "మీ క్కావలసిన విధంగా పట్టుకొచ్చాను. మీకు చక్కెర తక్కువగా ఉండాలిటగాదూ!" అన్నది.

"ఎవరు చెప్పారు?" అన్నాడు సారథి.

"సుబ్బు లక్కయ్య" అన్నది వరూధిని.

అంటూనే బల్లమీద కవరు చేత బుచ్చుకుని అడ్రసు చదివి ఫక్కున నవ్వింది.

"మీ మగవాళ్ళతో వేగడం చాలా కష్టమండీ! అయితే అతివృష్టి, లేకపోతే అనావృష్టి! అదీ ఇదీ కూడా

భరించడం కష్టమే! అక్కయ్య వెళ్ళి మరో రెండు గంటలకు 24 గంటలవుతాయి. ఇప్పటికప్పుడే మీరు ఉత్తరం రాస్తిరి?"

"ఇంకా రాయుందే" అన్నాడు సారథి.

"రాయ వలసిందేనే! మరెందు కాగారో గానీ" అన్నది వరూధిని. 'అయినా ఇంతే! అయితే భేదం ఉన్నదను కోండి. మీది అతివృష్టయితే, మా వారిది అనావృష్టి. గుబు లెత్తి నా అంతట నేను రావాలి గానీ, ఆయన వైద్యానికన్నా రమ్మని రాయరు".

సారథి కాఫీ తాగటంపూర్తి చేశాడు.

"ఉదయం హోటల్లో తిన్నారను కొంటాను. అసలు అన్నం తిన్నారా లేదా?" అన్నది వరూధిని.

"అదేం!" అన్నాడు సారథి.

"మరేంలేదు. దిగులువల్ల తిండిసహించకపోవచ్చుగా!" అన్నది వరూధిని.

"నా కటువంటిదేమీ లేదండీ!"

"అందుకేనా అప్పుడే ఉత్తరం రాశారు — పోనీ రాయడానికి తయారయ్యారు" అన్నది వరూధిని నిట్టూరుస్తూ. "దేనికైనా పెట్టి పుట్టాలి."

సారథి వరూధిని కేసి చూసి తలొంచుకున్నాడు.

"రాత్రికి భోజనానికి రండి"

"హోటల్లో తింటానుగా' అన్నాడు సారథి.

"తినలేరని కాదనుకోండి. హోటల్లో తింటే మీ ఆరోగ్యం చెడిపోతుందిగా మరి!"

"పోదులెండి!"

"పోతుందని మీ రక్కలో అనడం నేను స్వయంగా విన్నాను. సుబ్బులక్క నాకు చెప్పి వెళ్ళింది. అక్కడ కొచ్చి తినడానికి మీకు మొహమాటంగా ఉంటే – పోనీ – ఇక్కడికే పట్టుకొస్తాను. అంతేగాని –" అన్నది వరూధిని గ్లాసు సర్దుతూ.

"మీకు శ్రమ ఇస్తున్నాను"

"ఊరికే శ్రమ పుచ్చుకోకండి. తగిన ప్రతిఫలం చెల్లిద్దురుగాని! ఎప్పుడు చెల్లించాలో నేను చెబుతాను. చెప్పకపోయినా మీకయినా తెలుస్తుంది" అంటూ వెళ్ళిపోయింది వరూధిని.

సారథి కళ్లు రెండూ ఓసారి గట్టిగా నులుముకున్నాడు.

*  *  *  *

చొక్కా వంకెకు తగిలించి, కాళ్ళూ చేతులూ కడుక్కొని, ఓ గ్లాసు కూజాలో నీళ్ళు తాగి, కుర్చీలో చతికిలపడ్డాడు సారథి. బల్లమీద వారం రోజుల క్రిందట తను కొన్న కవరు అలానే పడి ఉంది. వారం రోజుల తర్వాత భార్యకు ఉత్తరం రాయడం భావ్యమా? కాదా? అని కాస్సేపు ఆలోచించాడు. భావ్యమే ననిపించింది. తన కిష్టమైనవన్నీ మంచివేనని నిర్ణయించుకోనడం మానవ స్వభావంలోనే ఉన్నదని మన మనుకొన్నప్పుడు సారథిని తప్పుపట్ట నవసరంలేదు.

సుబ్బులు దగ్గర్నించి ఉత్తరం వస్తుందేమోనని సారథి ప్రతిరోజూ ఎదురు చూసేవాడు. కానీ రాదని అతనికి గట్టిగా తెలుసు. తెలిసినప్పటికి వస్తుందేమోనన్న ఆశ మాత్రం వదిలేవాడు కాదు. అదే సమయంలో సారథికి తన మామ మీద విపరీతమైన కోపం వచ్చింది. ఆయనగారి దంతా ఓ

విడ్డూరం! అటు పాతను వదలనూ లేదు. ఇటు కొత్తతో సరి పెట్టుకోనూ లేదు. "అప్పుడప్పుడు ఉత్తరాలు రాస్తుండు నాయనా!" అంటాడు. రాసిన దానికి మాత్రం జవాబివ్వడు. అథవా అందకపోయినా కొంపలు మునుగుకుపోయే దేమీ ఉండదు. ఐనా ఉత్తరం అందినట్టు నాలుగు ముక్కలు రాస్తే ఏం పోయిందంటాడు సారథి. ఈ విషయం మీదనే మామా అల్లుళ్ళు ఒకటి రెండు సార్లు చాలా దూరం వెళ్ళారు కూడా.

"రాసిందానికి జవాబన్నా ఇవ్వమేవఁయ్యా?" అన్నాడు సారథి ఓర్పునంతా కోలుపోయి.

"ఇవ్వటానికేముందిగనక? అంతా క్షేమంగానే ఉంటిమిగా? ఏదన్నా అవాంతరం కలిగితే నేను మాత్రం రాయనా? ఉత్త పుణ్యానికి ఎడాపెడా రాసుకోడం ఎందుకు?" అన్నాడు మామ.

తనేమనేవాడోగాని, సుబ్బులు వచ్చి సర్దేశింది. పోనీ, ఆవిడన్నా ఓ ఉత్తరం ముక్క రాస్తుందా అంటే — అదీలేదు. ఇప్పటికి రమారమిగా వారం రోజు లయిందిగదా వెళ్ళి! తను చేరిందో కథాకమామీషూ రాయరాదా? పోనీ రాయించరాదా?

భార్యమీదా, అంతకన్నా మామగారి మీదా కోపం వచ్చింది సారథికి. ఆ కోపానికి కారణం మరేదైనప్పటికి ఉత్తరం రాకపోవడమనే సారథి సరిపెట్టుకున్నాడు. మనిషి ఎదురుగా ఉన్నట్టే భావించుకొని, ఉంటే తనేమి అనేవాడో అవన్నీ ఉత్తరంలో రాశాడు సారథి.

"... ఈ వారం రోజుల్నుంచీ నేనెంత ఆందోళన పడుతున్నానో మీకు తెలీదు. మీరు సక్రమంగా 'అడంగు'

చేరిందీ, లేనిదీ కూడా నాకు తెలియకుండా ఉంది. చేరలేదని తెలిస్తే పోలీసు రిపోర్టన్నా ఇద్దునుగదా! చేరే ఉంటే చాలా సంతోషం! ఈ వారం రోజుల్నించీ హోటలు తిండి తినడం వల్ల మళ్ళా దగ్గు ప్రారంభమైంది. రాత్రిపూట అసలే నిద్ర పట్టడం లేదు. ఇదో గొడవ. నిన్న ఆఫీసుకు వెడుతుంటే బాబిగాడి పంతులమ్మ కనిపించింది. మరో నాలుగు మూడు రోజుల్లో వాడు స్కూలుకు రాకపోతే పేరు తీసేస్తామన్నది. కాబట్టి నువ్వు వెంటనే బయలుదేరి రావలసింది. నువ్వు రావడానికి వీలుపడకపోతే — కనీసం పిల్లవాణ్ణి పంపినాచాలు. వాడి చదువు అర్థాంతరంగా ఆగిపోతున్నందుకు బాధగా ఉంది. ఇప్పటికే వాడు తరగతి పిల్లలందరికన్నా వెనకబడి ఉన్నాడు. ఇంతకన్నా నీకు రాయవలసింది లేదు. అనవసరంగా జాప్యం చేసిన తరువాత, రాగల ఫలితానికి విచారించి లాభం లేదు. ఆ తరువాత నీ యిష్టం..."

ఈ ధోరణిలో అయిదారు పేజీల దాకా రాశాడు ఉత్తరం. ఇంకెంత రాసేవాడోగానీ, ఉమాపతిగారు బరువుగా అడుగులు వేసుకొంటూ పైకొచ్చారు. వస్తూనే కుర్చీలో చదికిలపడి 'అమ్మయ్య' అనుకున్నారు. కాస్సేపుండి 'ఏదో రాస్తున్నారే!' అన్నాడు.

"మరేనండీ!" అన్నాడు సారథి.

'అయితే నే వెళ్ళి రానా ఏమిటి?'

'అయిపోయింది లెండి...ఫర్వాలేదు...కూచోండి... ఏమిటి సంగతులు చెప్పారు కాదు..." అన్నాడు సారథి.

"మరేం లేదు. మీ ఆడవాళ్ళు రావడానికి హీనమయినా చాలాకాలం పడుతుందనుకోండి...అనుకోవడమేమిటి

లేండి...పల్లానికి తిరిగిన నీరు, పుట్టింటి కెక్కిన ఆడది ఓపట్టాన తిరుగు ముఖం పట్టరనుకోండి...అందాకా మీరు మా ఇంట్లో భోంచెయ్య గూడదూ?" అన్నాడు ఉమాపతి.

"చెయ్యగూడదని కాదుగా — అనవసరంగా మీకు ఇబ్బంది గదాని ఆలోచిస్తున్నాను" అన్నాడు సారథి.

"గుప్పెడు గింజలు ఉడకెయ్యడానికి ఇబ్బందేమిటండీ నా బొంద! పోనీ నలుగురు పిల్లా జెల్లా ఉన్నారమ్మా. వీళ్ళతో తీరదనుకోడానికీ లేదాయె! మీ కోసం ప్రత్యేకంగా వండేదీ లేదాయె! ఏదో మాతో బాటే ఉన్నదేదో తింటే పోతుంది గదా! ఒకే యింట్లో వాళ్ళం మనలో మనం సర్దుకోకపోతే ఎలానండీ! రేపు నా కిబ్బందొస్తే, నన్ను మాత్రం మీరు హోటల్లో తిన్నిస్తారా?" అన్నాడు ఉమాపతి.

ఒకప్పుడైతే ఏమనేవాడో గానీ, ఇంత ఉపోద్ఘాతం జరిగాక 'తిన్నిస్తాను' అని సారథి గూడా అనలేకపోయాడు.

"ఎంతమాట?" అన్నాడు పైగా.

అంటే ఏమిటో సారథి ఆలోచించలేదు.

"ఈ మాట చెబుదామనే వచ్చాను. వెళ్ళి భోంచేసి రండి, నేనట్లా కాస్త పని చూసుకుని వస్తాను. మొహమాటం లేదుగా? నన్నుండమంటారా పోనీ? అయినా మీదంతా పిచ్చిగానీ, కొత్తవాళ్ళెవరండీ? లేనిపోని 'గిలి' పెట్టుకొని అర్ధాకలితో లేచేరు! అదో పాపం పైగా!" అంటూనే ఉమాపతిగారు వెళ్ళిపోయారు.

ఆయన వెళ్ళిన చాలా సేపటిదాకా సారథి ఆయన్ని గురించే ఆలోచించాడు. ఈ ఆలోచన ఉమాపతి గారిని కాదన్న సంగతి సారథి రూఢి చేసుకున్నాడు. దీని వెనుక

వరూధిని ప్రోద్బలం చాలా ఉండిఉంటుందని కూడా అతనసుమానించాడు. ఇంతకాలం నుండీ తన తిండిమీదలేని ఆపేక్ష, ఉమాపతి గారికి హఠాత్తుగా ఇప్పుడే పుట్టుకురావడం చాలా చిత్రమే! ఈ సంగతి యింతకాలమూ ఆయనగారికి తెలియదనుకోవడం ఆయనకు అన్యాయం చేసినట్లవుతుంది.

ఈ విషయం వరూధినితో మాటాడినప్పుడు తేలిపోయింది.

"పోనీ ఇప్పటికయినా వస్తారా, లేదా?" అన్నది వరూధిని.

"ఎప్పటికయినా?" అన్నాడు సారథి.

"ఆయనగారు కూడా పిలిచారు గదా? ఇంకా రాకపోవడానికి అడ్డేమున్నది? ఇదివరకంటె, నేనొక్కదాన్నే పిలిచాను గనుక—"

"అదేం లేదులెండి!" అని మధ్యలోనే మాటను తుంచేశాడు, సారథి.

ఇంకేమన్నా మాట్లాడతాడేమోనని వరూధిని కొద్దిసేపు ఎదురు చూసింది. మాట్లాడితే బావుండునని కూడా ఆవిడనుకొన్నది. ఏం మాట్లాడాలో తోచక సారథి ఉక్కిరిబిక్కిరయ్యాడు.

"అయితే నన్ను ఉండమంటారా? వెళ్ళమంటారా?" అన్నది వరూధిని పరధ్యానంగా అన్నట్లు.

"మీ ఇష్టం" అన్నాడు సారథి. కింద పనేమీ లేకపోతే ఉండండి. లేదా—" అని ఆగిపోయాడు.

"పనికేం లెండి. ఎప్పుడూ ఉండేదే? అదీగాక ఒక్కదానికి ఏం తోస్తుంది చెప్పండి? అత్తయ్యేమో రమణమ్మ

పిన్నిగారింటికి వెళ్ళింది. ఆయనగారేమో ఏదో పనిమీద వెళ్లారు. పోనీ చదువుకొందామన్నా ఓ మంచి పుస్తకం లేదాయె! అందుకని వీధి తలుపు గడియబెట్టి చక్కా వచ్చాను'' అన్నది వరూధిని.

ఆ మాటలంటున్నప్పుడు వరూధిని కళ్ళు తళతళ లాడటం సారథి గమనించాడు. ఆడవారి కళ్ళు ఎప్పుడు తళతళ లాడేదీ జ్ఞప్తికొచ్చి రవంత వొణికిపోయాడు సారథి.

"అయ్యో రామ!'' అన్నది వరూధిని గాఢంగా నిట్టూరుస్తూ. ఈ సంగతి మీరన్నా చెప్పారు కాదేం?''

"ఏ సంగతి?'' అన్నాడు సారథి పొడారిపోయిన గొంతును స్వాధీనం లోకి తెచ్చుకుంటూ.

"ఆ దడిచాటున ఉన్న మనుషులు ఇక్కడుంటే బాగా కనిపిస్తారు సుమండీ!'' అన్నదివరూధిని, బావి పక్కగా ఉన్న కందికట్టె దడి కేసి చూస్తూ.

"అలాగా?'' అన్నాడు సారథి.

అతనింత వరకూ ఆ విషయాన్ని గురించి ఎన్నడూ ఆలోచించ లేదు.

"నే నక్కడే స్నానం చేస్తుంటాను. కొంపలీసి ...'' అని ఫక్కున నవ్వింది వరూధిని.

సారథి కళ్ళముందు ఆ దృశ్యం ఓ క్షణకాలం మెరిసిపోయింది. దడిచాటున స్నానంచేస్తున్న వరూధినిని ఊహించుకున్నాడు. ఆ వెంటనే ఎదురుగా ఉన్న వరూధినిని తేరిపార చూశాడు. అతని చూపులు అక్కడ నిలవలేదు. కందికి వాలిపోయాయి.

* * *

సారథి బలవంతాన ఖాసీపట్టు వేసుక్కూర్చుని భోజనం చేస్తున్నాడు. వరూథిని వడ్డిస్తూ ఉంది.

'మొగమోటపడకు నాయనా! కడుపునిండా భోంచెయ్యి'' అన్నది ముసలమ్మ గడపలోకి వచ్చి.

''ఆ సంగతి నే చూసుకుంటాన్లెండి అత్తయ్యా!'' అన్నది వరూథిని. వారసలే భిడియస్తులు. మనుషులంటే మరింత కంగారు పడతారు. ఇటువంటాయనతో ఆ సుబ్బులక్క ఎలా వేగుకొస్తుందో ఏమోగాని—''

ముసలమ్మ ఓ క్షణం అక్కడే నిలబడి, తరువాత వెనక్కు తిరిగింది. కాస్సేపటికల్లా వసారాలోనుండి ''ఓ రామరామరామా! శ్రీరామ కాపాడరావేమిరా'' అన్న పాట వినిపించసాగింది.

''పాపం! ఆవిడేమన్నా అనుకోదూ?'' అన్నాడు సారథి తలొంచుకొని భోంచేస్తూనే!

''ఎందుకూ అనుకోవడం?'' అన్నది వరూథిని వసారాలోకి పరకాయించి చూస్తూ. ఎవ్వరూ లేరని రూఢిచేసుకొన్నాక, ''నా మాట అబద్ధమేమి కాదుగదా! నిజంగా మీాకు మనుషులంటే కంగారు, కంగారే! అవునా?''

'అబ్బే కాదు!' అన్నాడు సారథి.

'ఎప్పణ్నించీ?' అన్నది వరూథిని దాదాపు అతని చెంపకు తన చెంపను ఆనిస్తూ.

సారథి శరీరమంతా గరిపొడిచింది.

సమాధానం కోసం, కొద్దిసేపు అక్కడనే ఆరాడాక, వరూథిని చెంపపైకి లేచింది.

'కందిపచ్చడి వేసుకోరూ!' అంటూ ఇంత తెచ్చి వడ్డించింది. 'మీరు బాగా ఇష్టపడతారటగా! అందుకని, రెండు వెల్లుల్లి రెబ్బలూ, ఇంత కొత్తిమిర, ఓ ఇంగువ పాచా కూడా వేశాను. కలుపుకు చూడండి!'

వరూధిని తల, సారథి తలను కాస్తంత గట్టిగా నొక్కి, పైకి వెళ్ళింది. సారథి గనుక తలను పైకెత్తినట్లయితే, వరూధిని పెదవులు అతనికి అంది తీరేవి.

'మీరు నాకు మతి పోగొడుతున్నారు!' అన్నాడు సారథి నవ్వుతూ.

'ఇశ్శో!' అన్నది వరూధిని ముక్కుమీద వేలు వేసుకొని, మాటాడవద్దంటూ.

సారథి ఉలికిపడ్డాడు. తన పొరపాటు గ్రహించాడు. నాలిక కరుచుకొన్నాడు. వరూధిని, ఏదో పనున్నదానిలాగా, గడపదాటి వసారా అంచుదాకా వెళ్ళి తిరిగొచ్చింది.

'ఇంకా నయం ఎవ్వరూ విన్నారు కాదు. అయినా అంతగా కేక పెడతారెందుకు? చిన్నగా అంటే నాకు వినిపిస్తుందిగా?' అన్నధి వరూధిని హాయిగా నవ్వుతూ.

సారథి చెయ్యి కడుక్కున్నాడు.

'అప్పుడే లేచారేం! మజ్జిగ పోసుకోరా?' అన్నది చాలా పొడిపొడిగా.

'ఊఁహు. నా వల్ల కాదు. ఇహ అన్నం తినలేను.' అన్నాడు సారథి పీటమీంచి లేచి.

'బాగానే ఉంది మేళం' అన్నది వరూధిని. ఎందుకు సారథి అన్నం తినలేక పోతున్నాడో! తనకు తెలిసిపోయి నట్టు. 'పోనీ, తాంబూలమన్నా వేసుకుందురు కాని.'

సారధి నేతిజిడ్డును తుండుగుడ్డకు తుడుస్తూ అక్కడే నిలబడ్డాడు. వరూధిని తాంబూలం తెచ్చి సారధి చేతిలో నొక్కిపెట్టింది. ఆమె వేళ్ళు తన వేళ్ళతో ఏవో మంతనాలాడాయని సారధి గ్రహించాడు. ఆ మంతనాల పర్యవసానం ఏమిటో ఊహించుకొంటుంటే సారధికి ఆనందమూ, ఆశ్చర్యము కూడా కలిగాయి...

— రాత్రి ఎంత పొద్దుపోయిందో తెలీదు. కానీ చాలా పొద్దుపోయి ఉంటుందనుకున్నాడు సారధి. కళ్ళు భగ్గున మండుతున్నాయి. అయినా నిద్రమాత్రం రావడంలేదు. ఇలా నిద్ర రాకపోవడమన్నది సారధికి కొత్తకాదు. ఇదివరకు సుబ్బుల్ని గురించిన ఆలోచనలతో నిద్రపట్టేదికాదు. ఇప్పుడు వరూధిని తాలూకు ఆలోచనలు నిద్రను దూరంచేశాయి.

వరూధినిని చూస్తుంటే తనకు, పూజా పునస్కారాలు లేని దేవాలయం జ్ఞాపకమొస్తుంది. ముళ్ళ పొదల్లో జన్మించి, రాలిపోయే పూవు జ్ఞాపకమొస్తుంది. తీవ్రమైన శక్తులేవో, లోపల ఇమడలేక, బైట పడనూలేక గిజగిజా తన్నుకులాడటం తను వరూధినిలో చూస్తున్నాడు. ఆమెకు కావలసినవేవో దూరంగా ఉన్నట్టూ, వాటిని అందుకోనేందుగ్గాను తను ప్రయాసపడుతున్నట్టూ అనిపిస్తుంది. పోనీ భర్తమీద అయిష్టత కూడా, ఉన్నట్టు కనిపించదు. 'భగ్నప్రేమ' వ్యవహారాలు ఉన్న మనిషిలాగా కూడా ఉండదు. అయినా ఏదో అసంతృప్తి అగ్నిని రాజపెడుతూ ఉండాలి. లేకపోతే—

—సారధి చెవులు నిక్కించి విన్నాడు. మెట్లమీది నుండి ఎవరో వస్తున్న చప్పుడయింది. లేవకుండానే తల అటుకేసి తిప్పి చూశాడు. రెండు పిట్టగోడలమధ్యగా వరూధిని

ముఖం క్రమంగా పైకి లేస్తోంది. సారథి గుండె వేగంగా కొట్టుకొంది. మంచం మీద లేచి కూచున్నాడు. మంచం కిర కిర మని మెల్లిగా గోణిగింది.

ఆవిడ చేతిలో మంచి నీళ్ళ చెంబు ఉంది. వరూధిని మెట్ల దగ్గరే నిలబడి ఓ నిమిషం పాటు కిందికి చూసింది. తరువాత చప్పుడు కాకుండా అతని మంచం దగ్గర కొచ్చింది. చెంబును, మెల్లగా మంచం కోడుకు ఆనించింది. అలా వంగినప్పుడు, ఆమె తల్లోని గన్నేరు మొగ్గ రాలి సారథి వళ్ళో పడింది. సారథి దాన్ని తీసి వాసన చూశాడు.

'నిద్ర పోయారేమో నను కొన్నాను.' అన్నది వరూధిని మెల్లగా.

'లేదు' అన్నాడు సారథి.

అంత చల్లని వాతావరణంలోనూ, అతనికి చమటలు పోశాయి.

'రక్షించారు.' అన్నది వరూధిని అతని తలను, తన నుదురుతో అదుముతూ. 'ఇప్పటిదాకా, అత్తయ్య నిద్రపో లేదు. ఇప్పుడే కన్ను మూసింది.'

'కొంపతీసి లేవదు కదా?' అన్నాడు సారథి.

'నేను దేవతనా ఆ సంగతి చెప్పడానికి?' అన్నది వరూధిని. అంచాత —

సారథి కళ్ళముందు ఏవో రంగులు భగ్గున వెలిగాయి. అతని నెత్తురు నిండా మెరుపులు విరిశాయి. లోపలనుండి వెచ్చని ఆవిరి వెలికురుకు తున్నట్లనిపించింది. రెండు చేతులూ వరూధిని భుజాలమీద వేసి, తన కౌగిట్లోకి తీసుకొన్నాడు. ఆమె మెడమీద మెల్లిగా ముద్దు పెట్టుకున్నాడు. వరూధిని

పాములా అతన్ని చుట్టు కొన్నది.—ఆమె పెదవులు, ఆత్రంగా అతని నోటిని వెదికాయి. మంచం మరోసారి కిరకిరమని గొణుక్కొంది...

* * *

సారథి నిద్రలేచేసరికి కొంచెం పొద్దెక్కింది. అప్పటికే ఉమాపతి రెండు మూడుసార్లు పైకీ కిందికీ తిరిగాడు. నాలుగో సారి అతను పైకొచ్చి నప్పుడు సారథి ముఖం కడుక్కొంటు న్నాడు.

'ఇవాళ చాలా పొద్దెక్కిందాకా నిద్రపోయారే! రాత్రి సరిగ్గా నిద్రపోలేదా ఏమండీ?' అన్నాడు ఉమాపతి.

అతని మొఖం చూడటానికే సారథికి చాలా సిగ్గేసింది. చెయ్యరాని తప్పు చేసినట్టు గిలగిల లాడిపోయాడు. అటు కేసి చూడకుండానే 'మరే' అన్నాడు సారథి.

'మీ కోసం నే కూడా కాఫీ తాక్కుండా కూచున్నాను. చప్పున వస్తారుగా?' అంటూనే ఉమాపతి కింద కెళ్ళి పోయాడు.

సారథి ముఖం తుడుచుకొని, అద్దంముందు కొచ్చాడు. కళ్ళు ఎర్రగా ఉన్నాయి. జుట్టు చిందర వందరగా ఉంది. వేళ్ళతో జుట్టు సరిచేసుకొన్నాడు. కళ్ళు గట్టిగా నులుముకొ న్నాడు. కింద కెళ్ళడానికి సారథికి చెప్పరానంత భిడియ మేసింది. రాత్రి జరిగిన సంఘటన ఊరంతా తెలిసినట్టూ, నలుగురూ తనను వేలెత్తి చూపుతున్నట్టూ ఫీలయ్యాడు. చాలాకాలం తరువాత — అవును — చాలా సంవత్సరాల తరు వాత — తను కాలు జారాడు. ఇందులో తన ప్రమేయమేమీ లేదనుకోవడం ఆత్మవంచనే! తను నిలదొక్కు కోడానికి

ప్రయత్నించ లేదు. ప్రయత్నించి నట్లయితే_అది వేరు సంగతి! ఆ పని చెయ్యకపోగా, జారిపడటానికే ఉత్సహించాడు. ఆ పడటంలో ఏదో సుఖం ఉంది. సంతోషం ఉంది. సంతృప్తి ఉంది. ఉపశమనం ఉంది. కొన్నిసార్లు 'పొరపాటున జారిపడకుండా ఉండిపోనుగదా' అని కూడా అనుకొన్నాడు. అంటె తెలిసో తెలియకో, తను కూడా అటు కేసే వెళ్ళాడన్న మాట! జరిగిందేదో జరిగిపోయింది. ఇక మాత్రం అటువంటి పని జరక్కూడదు. తను పట్టు తప్పకూడదు...

అద్దంలో మరో రెండు కళ్ళు తనను పరిశీలనగా చూస్తున్నట్టు తెలిసి సారధి వెనక్కు తిరిగాడు. వరూధిని నిలబడి ఉంది. ఆమెలో ఏ మార్పూ లేదు. ఏ కంగారు లేదు. రోజూ ఉన్నంత ప్రశాంతంగా ఆ పూటా ఉంది. అంత స్థిమితంగా ఆవి డెలా ఉండ గలిగిందో సారధికి తట్టలేదు.

'ఆయనగారు తొందరపడుతున్నారు. త్వరగా రాగూడదూ?' అన్నది వరూధిని.

'వస్తున్నాను' అంటూ లేచాడు సారధి.

కాఫీ తాగుతున్నంత సేపూ అతని గుండెలు పింజెం పింజెం మంటూనే ఉన్నాయి. తనను తాను నిగ్రహించుకోలేక, పుసిక్కున ఏ మాట పైకి అనేస్తానోనని గడగడ లాడిపోయాడు. ఆ అతి జాగ్రత్తతో ఒక దానికి బదులు, మరో మాట అననే అన్నాడు. వరూధిని కేసి కన్నెత్తి చూడలేకపోయాడు. ముళ్ళమీద కూచున్నట్టు ఆ కాస్సేపు కూచుని గబగబ పైకి వచ్చాడు. ఎవరో వెనక నుండి తరుముకొస్తున్నట్టు — దాదాపు — ఉరుకులూ పరుగులూగా వచ్చిపడ్డాడు.

'హమ్మయ్య' అని నిట్టూర్చాడు సారధి.

తన పిరికితనానికి సిగ్గు పడటంతో పాటు, వరూధిని స్థైర్యానికి సారధి ఆశ్చర్యపోయాడు.

ఆవిడ చాలా మామూలుగా తనతో మాట్లాడింది. తనను చూసి నవ్వుతుం దనుకొన్నాడు. సిగ్గుపడుతుం దనుకొన్నాడు. కానీ అదేమీ లేదు. అన్ని ఉదయాల్లాగానే ఆ ఉదయమూ గడిచిపోయింది.

అతనికి గదిలో, ఉండ బుద్ధి కాలేదు. చొక్కా తొడుక్కొని చకచకా కిందికొచ్చాడు. మెట్లన్నీ దిగాక, పిల్లిలా అడుగులో అడుగు వేసుకొంటూ వీధితలుపు దగ్గర కొచ్చాడు. తన నెవరన్నా చూస్తున్నారేమోనని వెనక్కి తిరిగిచూశాడు. వరూధిని, వంటింటి గడపలో నిలబడి తన కేసి చూస్తోంది. ఎక్కడి కన్నట్లు, ఓసారి కనురెప్పలు విప్పార్చి చూచింది. సారధి తలొంచుకొని వీధిలో కొచ్చేశాడు.... ....

తిరిగి అతను ఇంటికొచ్చేసరికి, వంటిగంట దాటింది. చూరునీడ గడప దిగుతూ దిగుతూ ఉంది. వసారాలో వరూధిని ఒక్కతే ఉంది. తెల్లని చీర కట్టుకొంది. తల నున్నగా దువ్వుకొని, చిత్రంగా ముడిచుట్టుకొంది. గడపమీద కూచుని అటో కాలు, ఇటో కాలు వేసింది. గడ్డం మోకాలి మీదికి ఆన్చింది.

అ ్న చూస్తూనే లేచి నిలుచుంది వరూధిని. రెండు చేతులూ కలిపి, వెన్ను విరుచుకొని, రాని ఆవలింత ఆవలించింది. చేతి గాజులు గల గలమని శబ్దించాయి.

'మీ కోసమనే చూస్తున్నాను, చప్పున కాళ్ళు కడుకొస్తే వడ్డించేస్తాను.'

'మిగతా వాళ్ళేరీ?' అన్నాడు సారథి చుట్టూ ఓసారి కలయచూచి.

'ఎవరి పనులమీద వాళ్ళుంటారు. మీకోసం అజీలుగా కనిపెట్టుకొని ఉండాలంటే—' అన్నది వరూధిని లోపలి కెడుతూ. ఆగి, సారథికేసి తిరిగి 'పోనీ స్నానంగానీ చేస్తారా?' అన్నది.

సారథి పలకలేదు.

వరూధిని సన్నగా నవ్వింది.

'అక్కయ్య చెబుతుంటే ఏమోననుకొన్నాను. స్నానం చేయడానికి ఇంత బద్ధకస్తు లనుకోలేదు. పొయ్యేది మీ మురికేగానీ, నాది కాదుగా!' అన్నది వరూధిని.

సారథి కాళ్ళు కడుక్కొని లోపలి కొచ్చాడు.

''నిజంగా నాకీ పూట ఆకలిగా లేదు. ఇప్పుడే పీకల మొయ్యా పట్టించి వచ్చాను. ఇక మీరు బలవంతం పెడు తున్నారని తప్పితే—''

వరూధిని పలకలేదు.

సారథి మనస్సులో ఏదో ఆలోచన కదిలింది.

''ఇద్దరం ఇక్కడ ఉన్నాం. వీధి తలుపు తీసే ఉంది. పుటుక్కున ఎవరన్నా జొరబడరుగదా!'' అన్నాడు సారథి.

అంటూనే అతడు తలుపుకు గడియబెట్టి వచ్చాడు. వరూధిని అతనికేసి కళ్ళింత చేసుకుని చూస్తోంది. వస్తున్న నవ్వును పెదవులు ఆపలేక తక్కిస మక్కిస లాడుతున్నాయి. ఆ పెదవులను చూసి సారథి వెర్రెత్తి పోయాడు. ఆమెను ఆలింగనంలో పొదుపు కొన్నాడు. ఆమె పెదవులను తన చెంపకు ఆనించుకొన్నాడు...

వరూధిని బలవంతాన అతని పట్టునుండి తప్పుకుంది. అతని వైపు విజేతలా చూసింది. సారధి అడుగు ముందుకు వేయలేక పోయాడు. అక్కడే నిలబడిపోయాడు. వరూధిని చిన్నగా నవ్వింది.

"అతివృష్టి—అనావృష్టీని!" అన్నది వరూధిని మెల్లగా అతని దగ్గరకొస్తూ. 'ముందు భోజనం చేస్తే—'

"నా కొద్దు" అన్నాడు సారధి.

"ఏం" అన్నది వరూధిని.

"ఆకలిగా లేదు" అన్నాడు సారధి.

"ఏం" అన్నది వరూధిని మళ్ళా.

ఈ సారి సారధి జవాబు చెప్పలేక పోయాడు. చక చకా తన గది కొచ్చేశాడు. విసుగ్గా, చిరాగ్గా కుర్చీలో కూచున్నాడు. డ్రాయరుమీద తలపెట్టి చాలాసేపు ఆలోచించాడు. అలా ఆలోచిస్తూనే నిద్రపోయాడు.

ఆ రోజు మధ్యాహ్నం పుస్తకాలు వెదుకుతుంటే, ఆ నాటి కవరు కనిపించింది సారధికి. అదెప్పుడో అతను భార్యకు వ్రాసింది. దాన్నింకా పోస్టు చెయ్యనేలేదు. రాసినప్పుడు బద్ధకంవల్ల పోస్టు చెయ్యలేదు. ఆ తరువాత మరిచి పోయాడు. అడుగున పడిపోయింది.

"ఇంకా నయం, వేసేశాను కాదు!" అనుకున్నాడు సారధి.

ఆ ఉత్తరాన్ని తీసి మరోసారి చదువుకున్నాడు. ముక్కల కింద చింపి కుప్ప పోశాడు. చిత్రమేమిటంటే, ఈ నెల రోజుల్లోనూ సారధి ఒక్క ఉత్తరం ముక్కన్నా రాయక పోవడం! మామూలుగా అయితే సారధి ఈ సరికి అధమం

పది ఉత్తరాలన్నా రాసి ఉండేవాడు. అటునుండి ఒకటో రెండో వచ్చి ఉండేవి. మరీ రాయకపోతే బాగుండ దను కున్నాడు సారధి. అందుకని గబగబా నాలుగు బంతులు రాశాడు. తను సుఖంగా ఉన్నాననీ, కాకపోతే పిల్లలమీద అప్పుడప్పుడు మనస్సుపోతూ ఉన్నదనీ, ఉమాపతిగా రింట్లో భోంచేస్తున్నాననీ, రాశాడు. "నీవు తొందరపడి రానవసరం లేదు. దూరాభారం. మాటి మాటికి వచ్చి పోవడమంటే మాటలు కాదు. అదీగాక మీ నాన్న వెయ్యిగుళ్ళ పూజారి. ఆయన్ని హింసపెట్టి బయలుదేర దీయకు. ఆయనకు బెజ వాడలో పనులుంటాయి, గనుక అలా వచ్చినప్పుడు దిగబెట్ట మని చెప్పు. 'పద్దు ముండ'కు నా ముద్దులు. గోపీకి నా దీవె నలు. పెద్దబాబును ఊరికే తిప్పకు. నువ్వాన్నా నాలుగు అక్షరం ముక్కలు చెబుతుండు. లేదా సాలెపంతుల బళ్ళో కన్నా పంపు. వెంటనే జవాబు వ్రాయి. ఇంతే సంగతులు.." అంటూ ముగించాడు. ఆ రోజునే పోస్టు చేశాడుకూడా.

నాలుగు రోజుల తరవాత సుబ్బులు ఉత్తరం రాసింది.

"మీ ఉత్తరం అందింది. మీరు ఆరోగ్యంగా ఉన్నా మనకు సంతోషం. నాన్నగారు బెజవాడ రావడం ఇంతట్లో పడదు. మీరు అనుమతిస్తే ఇంకో నెలరోజులుంటాను. ఏ సం గతీ తెలియపరచ వలెను..."

సారధి ఆ మర్నాడే జాబు రాసి పడేశాడు. మరో నెల రోజులపాటు తను వరూథినితో హాయిగా ఉండ వచ్చునను కున్నాడు. ఆ నెల దాటాక సుబ్బులు రాకను ఇంకో నెలకు సులభంగా డేకించవచ్చు ననుకున్నాడు. ఇది వరకు సుబ్బులు ఎడబాటు ఎంతో ఖేదాన్ని కలిగించేది. అవిణ్ణి విడిచి ఉంటడ

మంటేనే గుండెలు గుబగుబ లాడిపోయేవి. ఇప్పుడు—దానికి పూర్తి వ్యతిరేకం. సుబ్బులు ఎంత ఆలస్యంగా వస్తే అంత మంచిది.

అనేకసార్లు తన భార్యకూ, వరూధినికీ తావిళ్ళు వేసుకున్నాడు సారథి. వరూధిని క్లాసు తెచ్చుకొంది. సుబ్బులు ప్యాసు మార్కులు తెచ్చుకొంది. వరూధినికి క్లాసు రావడానికి చాలా కారణాలు చెప్పుకున్నాడు సారథి.

తొలి రోజుల్లో అతను పశ్చాత్తాపపడిన మాట నిజమే! కానీ, రానురాను అది తగ్గిపోయింది. ఇందులో పశ్చాత్తాపపడవలసినదేమీ లేదనుకున్నాడు సారథి. ఒక స్త్రీ, ఒక పురుషుడు ఏకాంతంగా కలుసుకోవటంలో సారథికి తప్పు కనిపించడం మానేసింది. అది ప్రకృతి సిద్ధమని తనకు తాను నచ్చచెప్పుకున్నాడు.

—నెల రోజులు గడవక ముందే సుబ్బులు పిల్లలతో సహా వచ్చిపడింది. ఇలా వస్తున్నానని ముందుగా ఉత్తరమేనా రాయలేదు. సారథి భార్యమీద చిరాకు పడ్డాడు. సుబ్బులు ఏమీ మాట్లాడలేదు. పిల్లల్ని చూడగానే అతనికి ఏవో పొరలు విడిపోయినట్లనిపించింది. 'పద్దుముండ' రిక్షా దిగుతూనే "నాన్నా" అంటూ కాళ్ళకు చుట్టుకుంది. చంటివాడు చేతులు ముందుకు చాపి 'ఊంగ ఊంగ' అన్నాడు. వాణ్ని ఎత్తుకుని, గరుకుగడ్డంతో పొట్టమీద రుద్దాడు సారథి. వాడు పొట్టను ముడుచుకొని చప్పుడు లేకుండా నవ్వాడు...

ఆ రాత్రి భోజనాలయ్యాక ఆరుబైట మంచాలు వేసింది సుబ్బులు. పిల్లలంతా నిద్రపోయారు. సారథి మొహం మీదుగా చేతిని ప్రక్కకు వేళ్ళాడేసి పడుకొన్నాడు.

"నిద్రపోతున్నారా?" అన్నది సుబ్బులు.

సారధి మొహం మీదనుంచి చెయ్యితీసేశాడు.

"మీ కేమీ ఇబ్బంది పడలేదు గదా" అన్నది సుబ్బులు ఆకులకు సున్నం రాస్తూ.

"ఊఁహు" అన్నాడు సారధి.

సుబ్బులు సన్నగా నవ్వినట్లనిపించింది సారధికి.

"ఇది వరకు అన్ని ఉత్తరాలు వర్షంలా కురిపించేవారు గదా! ఈ సారి ఉత్తరమే కరువైపోయిందేం?" అన్నది భర్తకేసి చూస్తూ.

సమాధానం కోసం సారధి వెదుక్కున్నాడు.

"అవునుగానీ!" అన్నాడు సారధీ విషయాన్ని తప్పిస్తూ. "పది రోజులకే వస్తానన్నదానివి, నువ్వింతకాలం ఎందు కున్నావమ్మా?"

"ఎందుకా?" అన్నది సుబ్బులు ఆకుల్ని భర్తకందిస్తూ.

సారధి సమాధానంకోసం ఎదురు చూశాడు. కానీ సుబ్బులేమీ అనలేదు,

"ఈ సంగతి విన్నారా?" అన్నది సుబ్బులు భర్త మంచం మీద చోటు తీసుకుంటూ.

సారధి ఓసారి పిల్లల మంచం వేపు చూచాడు.

"పడుకొన్నాల్లెండి!" అన్నది సుబ్బులు. భర్త చెంపను అరచేతితో నొక్కుతూ "వరూధినికి..." అని ఫకాలుమని నవ్వింది.

సారధికి విషయం తెలిసిపోయింది.

"పిచ్చి తల్లి! ఎంత సంబరపడుతున్న దనుకొన్నారు!! చాలా కాలం తరువాత కడుపు పండిందేమో—ఆవిడ, ఆనందం

పట్టలేకుండా ఉన్నదనుకోండి! ఆ ముసలమ్మగారు—ఓ—ఒకటే మురుసుకొంటున్నది'' అన్నది సుబ్బులు.

''అలాగా నాకు తెలియదే?'' అన్నాడు సారథి నిజంగానే ఆశ్చర్యపడి.

ఈ సారి సుబ్బులుకు నవ్వాగలేదు. వరదలాగ నవ్వేసింది. అతి నవ్వువల్ల ఆమె కళ్ళల్లో నీళ్లు కూడా తిరిగాయి.

''అది కాదండీ! ఎవరికో నెల తప్పితే మీాకెందుకు తెలియాలీ అంట మధ్యలో?'' అన్నది సుబ్బులు, అదే స్థాయిలో నవ్వుతూ.

సారథి ముఖం చిన్నబోయింది. అయినా అతనూ నవ్వాడు.

''నువ్వొచ్చి...అవును గాని......ముందుగా ఉత్తరమన్నా రాయకుండా వచ్చావేం?'' అన్నాడు.

''నే వెళ్ళిన పని పూర్తయింది. ఇంకా ఎందుకండీ అక్కడ ఉండటం! అందుకని....''అన్నది సుబ్బులు భర్త గుండెల్లో ముఖం దాచుకుంటూ.